# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 05-07-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రెండవ రోజు ఢిల్లీ పర్యటనలో భాగంగా ఈరోజు పలువురు కేంద్రమంత్రులను కలిశారు.**
2. **మహిళలు, చిన్నారులు, కౌమార దశలో ఉన్న బాలల సంరక్షణకు భారత్ ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి జేపీ నడ్డా తెలిపారు.**
3. **రాష్ట్రంలో యువతకు ఉపాధి అవకాశాలు పెంచేందుకు పరిశ్రమలతో కలిసి పనిచేయాలని అధికారులను విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఆదేశించారు.**
4. **బ్రిటిష్ వలస పాలన నాటి చట్టాలను ప్రక్షాళన చేస్తూ కేంద్ర ప్రభుత్వం రూపొందించిన నూతన నేర చట్టాలపై విజయవాడ ఆకాశవాణి ప్రాంతీయ వార్తా విభాగం ఆధ్వర్యంలో విజయవాడలో ఈరోజు వర్క్ షాప్ జరుగుతోంది.**
5. **ప్రస్తుత 2024-25 విద్యాసంవత్సరానికి 3వ తరగతి నుంచి ఆరవ తరగతి వరకు కొత్త పాఠ్య పుస్తకాలను ప్రవేశపెడుతున్నట్లు కేంద్ర విద్యా శాఖ తెలిపింది.**

==========================

ఢిల్లీ పర్యటనలో భాగంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌తో సమావేశమయ్యారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్ర అంశాలకు ప్రాధాన్యతనిస్తూ నిధుల కేటాయించాలని ఆర్థికమంత్రిని కోరారు. కేంద్ర ప్రభుత్వం చేయూతనిచ్చి ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న రాష్ట్రాన్ని ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రితో పాటు కేంద్రమంత్రులు పెమ్మసాని చంద్రశేఖర్, రామ్మోహన్ నాయుడు, ఆంధ్రప్రదేశ్ ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్, పలువురు ఎంపీలు పాల్గొన్నారు.

---------------------------

మహిళలు, చిన్నారులు, కౌమార దశలో ఉన్న బాలల సంరక్షణకు భారత్ ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి జేపీ నడ్డా తెలిపారు. జెనివాలో జరిగిన ప్రసూతి, నవజాత, ఛైల్డ్ హెల్త్ –పీఎంఎన్ సిహెచ్ బోర్డు సమావేశవంలో కేంద్రమంత్రి పాల్గొని ప్రసంగిస్తూ తల్లీ బిడ్డల మనుగడను మెరుగు పరచడంలో ప్రపంచ సగటు కంటే వేగంగా భారత్ ముందుందని అన్నారు. లింగ సమానత్వాన్ని పెంపొందించడంతో పాటు మహిళలు, పిల్లలు, యుక్తవయస్సు వారిని రక్షించడంలో బారత్ కట్టుబడి ఉందని పేర్కొన్నారు. భారతదేశం యొక్క సమగ్ర ఆరోగ్య కార్యక్రమాల్లో 2030 కంటే ముందే సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను సాధించడానికి కృషి చేస్తుందని కేంద్రమంత్రి స్పష్టం చేశారు.

-------------------------

2023-24 ఆర్థిక సంవత్సరంలో రక్షణ ఉత్పత్తి విలువలో భారతదేశం అత్యధిక వృద్ధిని నమోదు చేసింది. 2023-24లో ఉత్పత్తి విలువ దాదాపు లక్షా 26 వేల 8 వందల 87 కోట్లకు చేరుకుంది. ఇది గత ఆర్థిక సంవత్సరం ఉత్పత్తి విలువ కంటే 16.8 శాతం ఎక్కువ అని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఈరోజు సామాజిక మాధ్యమం వేదికగా పోస్టు చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో మేక్ ఇన్ ఇండియా కార్యక్రమం సంవత్సరానికి కొత్త మైలురాళ్లను దాటుతోందని అన్నారు. భారతదేశాన్ని ప్రముఖ గ్లోబల్ డిఫెన్స్ మాన్యుఫ్యాక్చరింగ్ హబ్‌గా అభివృద్ధి చేయడానికి మరింత అనుకూలమైన వనరులు రూపొందించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన అన్నారు.

-------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈనెల 8, 9 తేదీల్లో రష్యాలో అధికారికంగా పర్యటిస్తారని విదేశాంగ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. రష్యాలో జరిగే 22వ వార్షిక శిఖరాగ్ర సదస్సుకు.. రష్యా అధ్యక్షులు వ్లాదిమిర్ పుతిన్ ఆహ్వానం మేరకు నరేంద్రమోదీ మాస్కో సందర్శించనున్నారని విదేశాంగ మంత్రిత్వ శాఖ తెలియజేసింది. ఈ సందర్భంగా ఇరు దేశాల నాయకులు ప్రస్తుత అంతర్జాతీయ, ప్రాంతీయ అంశాలపై చర్చిస్తారని ఆ శాఖ తెలిపింది. అలాగే ప్రధానమంత్రి నరేంద్రమోదీ మాస్కోలో భారత సంతతిని ఉద్దేశించి ప్రసంగిస్తారని పేర్కొంది. అనంతరం ప్రధానమంత్రి 9, 10 తేదీల్లో ఆస్ట్రియాను సందర్శిస్తారు. ఈ సందర్భంగా నరేంద్ర మోదీ ఆస్ట్రియన్ అధ్యక్షుడు అలెగ్జాండర్ వాన్ దెర్ బిల్లన్‌తో సమావేశమై ద్వైపాక్షిక చర్చల జరపనున్నారు. అలాగే ప్రధానమంత్రి నరేంద్రమోదీ వియాన్నాలో భారత సంతతిని కలుసుకుని ముచ్చటిస్తారని విదేశాంగ శాఖ తెలిపింది.

-------------------------

రాష్ట్రంలో యువతకు ఉపాధి అవకాశాలు పెంచేందుకు పరిశ్రమలతో కలిసి పనిచేయాలని నైపుణ్యాభివృద్ధి శాఖ అధికారులను విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఆదేశించారు. రాష్ట్రంలోని ఐటీఐ, పాలిటెక్నిక్ కళాశాలలను పరిశ్రమలతో అనుసంధానించి ఉపాధి అవకాశాలను మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. నైపుణ్యాభివృద్ధి శాఖ ఉన్నతాధికారులతో నిన్న సమీక్ష నిర్వహించి మాట్లాడుతూ మంత్రి.... 'ప్రతి ఐటీఐ, పాలిటెక్నిక్ కళాశాలను స్థానికంగా ఉన్న కంపెనీలతో అనుసంధానించి, విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంచేలా ప్రణాళికలు తయారు చేయాలని.... ఇందులో భాగంగా అమరావతిలో నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్...న్యాక్ కేంద్రాన్ని...., గుంటూరు జిల్లా మంగళగిరిలో జెమ్స్, జ్యుయలరీ శిక్షణా సంస్థను నెలకొల్పేందుకు సర్వే నిర్వహించి, తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేందుకు విభాగాల వారీగా ప్రణాళికలు రూపొందించాలని తెలిపిన మంత్రి... ఉపాధి కల్పనపై కేరళ అనుసరిస్తున్న విధానాలను అధ్యయనం చేయాలి' అని ఆదేశించారు.

-------------------------

బ్రిటిష్ వలస పాలన నాటి చట్టాలను ప్రక్షాళన చేస్తూ కేంద్ర ప్రభుత్వం రూపొందించిన నూతన నేర చట్టాలపై విజయవాడ ఆకాశవాణి ప్రాంతీయ వార్తా విభాగం ఆధ్వర్యంలో ఆకాశవాణికి సంబంధించిన పార్ట్ టైం కరస్పాండెంట్లకు విజయవాడలో ఈరోజు వర్క్ షాప్ జరుగుతోంది. ఆకాశవాణి ప్రాంతీయ వార్తా విభాగాధిపతి శ్రీ సాయి వెంపాటి పరిచయ వాక్యాలతో ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో ఆకాశవాణి డిప్యూటి డైరెక్టర్ జనరల్ ఎం. సోమేశ్వర రావు స్వాగతోపన్యాసం చేస్తారు, డిప్యూటీ పోలీస్ డైరెక్టర్ జనరల్ అత్తిరాజు ప్రధానోపన్యాసం

చేస్తారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వ అదనపు అభియోగ సంచాలకులు విశిష్ట అతిథిగా హాజరై నూతన నేర చట్టాలను వివరిస్తారు. ఆ తరువాత అతిథులకు సత్కార కార్యక్రమం జరుగుతుంది.

---------------------------

ప్రస్తుత 2024-25 విద్యాసంవత్సరానికి 3వ తరగతి నుంచి ఆరవ తరగతి వరకు కొత్త పాఠ్య పుస్తకాలను ప్రవేశపెడుతున్నట్లు కేంద్ర విద్యా శాఖ తెలిపింది. పాఠ్య పుస్తకాల రూపకల్పన తుది దశలో ఉందని 3 నుండి 6వ తరగతి వరకు పాఠ్య పుస్తకాలు ఇప్పటికే అందుబాటులో ఉన్నాయని ఆ శాఖ పేర్కొంది. మిగిలిన 8వ తరగతి పుస్తకాలు త్వరలో అందుబాటులోకి వస్తాయని తెలిపింది. ఈ మేరకు కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్.. నిన్న ఢిల్లీలో కేంద్రవిద్యాశాఖ కార్యదర్శి, ఎన్‌సిఈఆర్‌టి డైరెక్టర్, సిబిఎస్‌ఈ చైర్ పర్సన్, తదితరులలో కలిసి ఎన్‌సిఈఆర్‌టి పుస్తకాల రూపకల్పనపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 2020 జాతీయ విద్యా విధానం ద్వారా నాణ్యమైన పుస్తకాలను చౌక ధరలకు అందిస్తున్నట్లు మంత్రి తెలిపారు.

---------------------------

పోలవరం ప్రాజెక్టు 'కోర్' నిర్మాణాలన్నీ పటిష్ఠంగానే ఉన్నాయని.. సాంకేతికంగా అన్నీ సక్రమమేనని అంతర్జాతీయ నిపుణులు పేర్కొన్నారు. అమెరికాకు చెందిన ప్రాజెక్టు నిర్మాణ నిపుణులు జియాన్ ఫ్రాంకో డి సిక్కో, డేవిడ్ బి పాల్.. కెనడా నిపుణులు సీన్ హించ్‌బెర్గర్, రిచర్డ్ డొనెల్లీ ప్రాజెక్టు ప్రాంతంలో నిన్న నాలుగు రోజుల పాటు పర్యటించి.. దెబ్బతిన్న కట్టడాలను అధ్యయనం చేసి.. ప్రాజెక్టు అధికారులు, కేంద్ర జల సంఘం చైర్మన్ కుశ్వీందర్ వోహ్రాకు తమ అభిప్రాయాలు వెల్లడించారు. డయాఫ్రం వాల్ పూర్తిగా దెబ్బతినలేదని, దాన్ని మరమ్మతు చేయవచ్చని.. ఆ తర్వాత దానిపై ఎర్త్ కమ్ రాక్‌ఫిల్ డ్యాంను నిర్మించవచ్చని చెప్పారు. ఇక కాఫర్ డ్యాంలలో సీపేజీ నివారణకు మరిన్ని పరీక్షలు చేపట్టాలన్నారు. కాఫర్ డ్యాం దిగువన లోతుగా నదీగర్భ ఇసుక ఉన్నందున.. కొద్దిపాటి సాంకేతిక చర్యలతో సహజసిద్ధంగానే సీపేజీ తగ్గించేందుకు అవకాశం ఉందని తెలిపారు. వైబ్రో కంపాక్షన్ విధానంలో సీపేజీని అడ్డుకోవచ్చన్నారు. ఈ రెండు అంశాలపై తాము త్వరలో ప్రాథమిక నివేదికను అందజేస్తామని స్పష్టం చేశారు..

---------------------------

సమాజానికి పోలీసులు ఆదర్శప్రాయంగా నిలవాలని సత్యసాయి జిల్లా ఎస్పీ ఎస్వీ మాధవ్ రెడ్డి పోలీసులకు సూచించారు. పుట్టపర్తి లోని పోలీస్ పరేడ్ మైదానంలో జిల్లాలో సేవలందిస్తున్న హోంగార్డులకు ఈరోజు అభినందన కార్యక్రమంలో ఈరోజు జిల్లా ఎస్పీ పాల్గొని.. మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ శాఖలలో పోలీస్ శాఖకు ఒక ప్రత్యేకమైన స్థానం ఉందని, అందుకోసమే పోలీసులు సమాజానికి ఒక ఆదర్శప్రాయంగా నిలవాలని అన్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో సమర్థవంతంగా విధులు నిర్వర్తించిన హోంగార్డుల సేవలు అమోఘమని కొనియాడారు. మున్ముందు ఇదే స్ఫూర్తి కొనసాగించి జిల్లాను ప్రశాంతంగా ఉంచడంతో పాటు ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే మన లక్ష్యంగా ఉండాలని సూచించారు. పోలీసుల పట్ల ప్రజల్లో విశ్వాసం పెంపొందేలా ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని మాధవ్ రెడ్డి కోరారు.

---------------------------

కేంద్ర ప్రభుత్వ విద్యాశాఖ ఏటా ఉత్తమ సేవలు అందించిన ఉపాధ్యాయులకు అందించే జాతీయ ఉపాధ్యాయ పురస్కారాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు రాష్ట్ర పాఠశాల విద్య కమిషనర్ సురేశ్ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. అర్హత గలవారు 2024 విద్యా సంవత్సరానికి గాను ఈనెల 15వ తేదీలోగా

nationalawardstoteacher.education.gov.in ద్వారా వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వచ్చే నెల 13న విజేతలను ఎంపిక చేసి, సెప్టెంబర్ 4, 5 తేదీల్లో పురస్కారాలు ప్రదానం చేస్తారని పేర్కొన్నారు.

---------------------------

భారత స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని సత్ప్రవర్తన కలిగిన ఖైదీలను వచ్చే ఆగస్టు 15న విడుదల చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడికి ఆయన లేఖ రాశారు. క్షణికావేశంలోనో, ఆగ్రహంతోనో తప్పు చేసినవారు సంవత్సరాల తరబడి జైలు గోడల మధ్య ఖైదీలుగా ఉండిపోతున్నారని.... వారికి క్షమాభిక్ష ప్రసాదించి విడుదల చేసేందుకు చర్యలు చేపట్టాలని రామకృష్ణ ఆ లేఖలో కోరారు.

======================